ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | గురువారం | 02.07.2026 | సంపుటి : 2 | సంచిక : 01 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

## ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి

### శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి

### అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

హైదరాబాద్, జూలై 1 : ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఫేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు

-మిగతా 2 లో..



## ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

### పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి

02

### వరి బదులు ఆరుతడి పంటలపై సీఎం రేవంత్ సూచనలు



04

## ట్రంప్‌పై 'క్రిప్టో' వర్షం..

ఒక్క 2025లోనే రూ.11వేల కోట్ల ఆర్జన



04

ఆగివున్న ట్రక్కును

## ఢీకొన్న బస్సు

ఎనిమిది మంది సజీవ దహనం



## అయోధ్య విరాళాల చోరీ..

కుంభమేళా సమయంలోనే భారీగా మిస్సింగ్

04



# పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం

## నలుగురు సజీవదహనం

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

### మంటల్లో చిక్కుకుని ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు మృతి

### "అన్నా కాపాడండి.. నాకు పిల్లలున్నారు" అంటూ డ్రైవర్ ఆర్తనాదం

### అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక అంచనా

**పల్నాడు, జూన్ 28 :** "అన్నా కాపాడండి.. నాకు పిల్లలున్నారు" అంటూ మంటల్లో చిక్కుకున్న ఓ లారీ డ్రైవర్ చేసిన ఆర్తనాదం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. కానీ మంటల తీవ్రత కారణంగా అతడిని రక్షించడం ఎవరి వల్లా కాలేదు. పల్నాడు జిల్లా బోయపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు సజీవదహనమయ్యారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఢీకొట్టడంతో రెండు లారీల ఇంధన ట్యాంకులు పేలి భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే మంటలు లారీలను చుట్టుముట్టడంతో క్యాబిన్లలో ఉన్న ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు బయటకు రాలేక

-మిగతా 2 లో..

# ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు?

## తెలంగాణను పదేపదే కించ పరుస్తున్న రేవంత్

### కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా

### కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు

### బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై మేం చర్చకు సిద్ధమే

### తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం

### మీడియా సమావేశంలో కేటీఆర్ సవాల్



హైదరాబాద్, జూలై 1 : కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ. 3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై

-మిగతా 2 లో..



# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

### ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకెళ్లాలి

### కేంద్రీయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పిలుపు

ఏఐ, డేటా సైన్స్ వంటి సాంకేతికతలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి ప్రసంగించారు.

అనంతపురం, జూలై 1 : ఎన్నో కలలతో వర్సిటీలోకి విద్యార్థులు అడుగుపెడతారు. భవిష్యత్తు కోసం నూతనోత్సాహంతో విద్యార్థులు తయారవుతారు. వర్సిటీలో కష్టపడినట్లే భవిష్యత్తులోనూ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. సమాజంలో మీవంతు పాత్ర పోషించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వికసిత్

- మిగతా 2 లో..

# వైఫల్యాలపై దృష్టి మరల్చే ఎత్తులు

## రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీసారు

### అన్నదాతల అసలు సమస్యలపై పట్టింపేది

### వైఫల్యాలపై చర్చకు సిద్ధంగా ఉన్నాం

### సిఎం రేవతంంకు హరీష్ రావు సవాల్

శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు.



హైదరాబాద్, జూలై 1 : రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

# ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

### నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి

### డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహా

డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు.



03



## రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# కేసీఆర్ గొప్పగా పాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారు?

### మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జూలై 1 : కేసీఆర్ గొప్పగా పరిపాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని ఆయన అప్పుల పాల్జేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలో జూపల్లి స్పందించారు. కేసీఆర్ చేసిన అప్పులపై శాసనసభలో లెక్కలతో సహా రుజువు చేశామన్నారు. రాష్ట్ర ప్రజల జేబులకు చిల్లు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న అప్పు ఎవరు కడతారని జూపల్లి ప్రశ్నించారు. ఇదే అంశాన్ని శాసనసభలో అడిగితే ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పలేదన్నారు.



# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా బ్జడెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బ్జడెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బ్జడెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు



**హైదరాబాద్,జూలై1 :** నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవా లనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచా రం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమ యంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించ డం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# భీమ్‌గల్ విద్యుత్ శాఖ ఏడీగా రాజేందర్ రెడ్డి

**నిజామాబాద్,జూలై1 :** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల విద్యుత్ శాఖ నూతన అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీ)గా రాజేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి ఏడీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ పరిపాలన కొనసాగుతుండగా, ప్రభుత్వం ఇటీవల రాజేందర్ రెడ్డిని శాశ్వత ఏడీగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విద్యుత్ శాఖ టౌన్ ఏఈ సత్యప్రసాద్, శాఖ అధికారులు, సిబ్బంది, లైన్‌మెన్లు రాజేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఏడీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ టౌన్ ఏఈ సత్యప్రసాద్, శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

**నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాల్సిందే**

**కూనంనేని ఆధ్వర్యంలో లెఫ్ట పార్టీల ధర్నా**

**కొత్తగూడెం, జూలై 1 :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కొలగొట్టేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సర్ పేరుతో ఓట్లను తొలగించి తమకు అనుకూలమన్న ఓటర్లను మాత్రమే చేర్చే పక్రియ చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, జీవో నెంబర్ 76 ను పునరుద్ధరించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పేదల పక్షాన పోరడడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడు గణెలిష్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ముత్యాలు, విశ్వనాథం, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)



ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురిపించారు. సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్య్రం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు? సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనా?ప్రెస్‌క్లబ్‌లోనా?జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా‘ అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని తదితరులు పాల్గొన్నారు.

# వైఫల్యాలపై దృష్టి మరల్చే ఎత్తులు

(మొదటిపేజీ తరువాయి)



కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బ్జడెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బ్జడెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా? అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీష్ రావు సవాల్ విసిరారు.

# నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు

**సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు**

**మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు**

**పున్నపువారిపల్లెలో పేదలసేవలో కార్యక్రమంలో చంద్రబాబు**



**నెల్లూరు, జూలై 1 :** రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగువారిని అందలం ఎక్కించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారి పాలెంలో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....‘ప్రజలు చూపిస్తున్న అభిమానంతో పడుతున్న కష్టాన్ని మర్చిపోతున్నాం. గత పాలకులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి నెరవేర్చాం. సైదాపురం, కలవాయి మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపాం. ప్రజల అభీష్టం ప్రకారమే పరిపాలన జరగాలి. పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అశాస్త్రీయంగా జరిగినల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగు నింపాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. సామాజిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ తేదీన కనీస అవసరాలు తీర్చుకోలేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్దిదారులకు పెన్షన్లు అందిస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మందికి రూ.2,712 కోట్లు పెన్షన్లకు చెల్లిస్తున్నాం.’ అని సీఎం అన్నారు. గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటంతో పాటు వ్యవస్థలను గాడిలో పెట్టామని, సంక్షోభాలు, సమస్యలను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నామని అన్నారు. ’గత పాలకులు ఐదేళ్ల పాటు విధ్వంసం చేశారు... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. రెండేళ్ల లోనే అన్ని పనులూ చేసేశామని మేం చెప్పటం లేదు. కానీ శుభారంభం చేశాం. గత అవినీతి పాలనను మార్చి రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలన తీసుకువచ్చాం. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను అందిస్తూ ప్రజల చేతిలోకి పౌర సేవలను తీసుకువచ్చాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించగలుగుతున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేశాం. పేదల జీవన ప్రమాణాలు పెంచి వారికి అండగా నిలవాలనేది కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. ఆర్థిక అసమానతలు తొలగించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు నా జీవితాన్ని అంకితం చేశాను. లక్ష మందికి పైగా మార్గదర్శులు, 10 లక్షలకు మందికి పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తయారు చేసేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ’రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిలో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుంన్నారు.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

భారత్ నిర్మాణంలో విద్యార్థుల ప్రాత ముఖ్యమైంది. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. వేల మంది విద్యార్థులున్నా.. తొలి బ్యాచ్‌కు ఒక గుర్తింపు ఉంటుందన్నారు. పతకాలు సాధించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తు కలల సాకారానికి ఇదో వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి దాయకమన్నారు.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

**మెటాకు కేంద్రం నోటీసులు.. వివరాలు ఇవ్వాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,జూలై1 :** వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటి వరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని పేర్కొంది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. యూజర్‌నేమ్ విషయంలో సైబర్ నిపుణుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రముఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూజర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన. ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి. ఈ ఫీచర్‌పై పూర్తి వివరాలు ఇచ్చేందుకు మెటాకు కేంద్రం మూడు రోజుల గడువు ఇచ్చినట్టు కూడా తెలుస్తోంది. భారత్ లాంటి దేశంలో ఈ ఫీచర్ కొత్త చిక్కులు తేవొచ్చన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇది అనేక మోసాలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బస్సు ఢీకొని విద్యార్థి మృతి

**వికారాబాద్,జూలై1 :** చేవెళ్ల మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కందాడ గ్రామానికి చెందిన షేర్ కృష్ణారెడ్డి రెండో కుమారుడు సాత్విక్‌రెడ్డి.. మొయినాబాద్‌లోని ఓ ప్రవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వెళ్లేందుకు బస్సు కోసం చౌరస్తాలో వేచి ఉన్నాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు.. దాని ముందు ఉన్న కారును తప్పించే క్రమంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న విద్యార్థిని ఢీకొంది. ఈ ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



# పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

సజీవదహనమయ్యారు. ఒక లారీలో కాగితం లోడు ఉండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించినట్లు సమాచారం. మంటల్లో చిక్కుకున్న ఓ డ్రైవర్ ప్రాణాల కోసం వేడుకుంటూ “అన్నా కాపాడండి.. నాకు పిల్లలున్నారు” అంటూ ఆర్తనాదాలు చేశాడు. స్థానికులు సహాయం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మంటల తీవ్రత కారణంగా లారీల దగ్గరకు వెళ్లలేకపోయారు. కళ్లముందే నలుగురు సజీవదహనమవడాన్ని చూసి స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి అతివేగం, నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

**ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత**
**సిఎం రేవంత్‌తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి**
**అన్‌లాగ్ సిఇవో అలెక్స్ కిప్‌మాన్**



**హైదరాబాద్, జూలై 1 :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండి బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు. సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్ధవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఎఐ కి అనుసంధానించాలని సీఎం సూచించారు. మావేశం అనంతరం ముఖ్యమంత్రి గారి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

## ఏపీలో విద్యా సంస్కరణలు భేష్

**లోకేశ్‌ను అభినందించిన రాష్ట్రపతి**



**అనంతపురం, జూలై 1 :** ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసిం చారు. విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవం తంగా అమలు చేస్తున్న లోకేశ్‌ను రాష్ట్రపతి అభినం దించారు. ఈ సంస్కరణలు కొన సాగాలని సూచించారు. బుధవారం అనంతపురం లోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేశ్ వెళ్లారు. తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్క రణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినం దించారు. వీటిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థలో మార్పులు వారి బంగారు భవిష్యత్తుకు మార్గం వేస్తాయని రాష్ట్రపతి అన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం స్ఫూర్తివంతంగా సాగిందని అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.



## ప్రగతి ప్రణాళిక అమలుపై ఆరా

**అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్, జూలై 1 :** రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమిక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను సిఎస్ కు వివరిం చారు. అలాగే జిల్లాలలో అమలు చేసిన వినూత్న విధానాలతో సానుకూల ఫలితాలు వచ్చాయని, వాటిని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ 99 రోజుల కార్యక్రమంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను అందించారు. కార్యక్రమంలోని వివిధ అంశాల కింద ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నోడల్ అధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

**హైదరాబాద్, జూలై 1 :** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2వ తేదీన గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించను న్నారు. ఈ కేబినెట్ సమావేశం జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సిఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపోతే వివిధ అంశాలపై ఈ కేబినేట్‌లో చర్చించనున్నారు. ఇటీవలే కేంద్రం మూసీ ప్రక్షాళనకు ఆమోదం తెలిపింది. అలాగే మెట్రోకు కూడా పచ్చ జెండా ఊపింది. ఈ క్రమంలో ఎ లా ముందుకు వెళ్లాలన్నదానిపై చర్చించే అవకాశం ఉంది.

## టూవీలర్‌ను ఢీకొన్న కాలేజీ బస్సు

**మహిళ అక్కడిక్కడే మృతి**

**హైదరాబాద్,జూలై 1 :** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళు తున్న మహిళను ఓ కాలేజీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్‌కు కారణమైంది. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హైవేపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కాలేజీ బస్సు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతతో మహిళ బస్సు కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రాకపోకలను క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేశారు. కొంతసేపు ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## మణికొండలో ఈగిల్ టీమ్ దాడులు

**హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న వక్తి పట్టివేత**

**హైదరాబాద్,జూలై 1 :** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగం గా ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన వ్యక్తిని హ్యాష్ ఆయిల్ విక్రయిస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు మణికొండ పరిధిలోని సదరు ప్రైవేట్ హోటల్‌పై ఈగల్ టీమ్ సభ్యులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితు డిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. నిందితుడి నుంచి 9 గ్రాముల లీక్విడ్ హ్యాష్ ఆయిల్‌ను అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హ్యాష్ ఆయిల్‌ను స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హ్యాష్ ఆయిల్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు ఐటీ కారిడార్‌లోని ఎవరెవరికి దీనిని సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందు కు నిఘా మరింత కఠినతరం చేసినట్లు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

- నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి
- డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, జూలై 1 :** డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అదె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



## రేవంత్ రెడ్డికి రైతులు బుద్ధి చెప్పడం ఖాయం

**బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్, జూలై 1 :** రైతులను అడుగడుగునా ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు ఆశీర్వాద సభ అంటూ నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా తన ప్రసంగాన్ని కొనసాగించారని ఆరోపించారు. ప్రజాధనంతో సభలు ఏర్పాటు చేసి ఆశీర్వాద సభను శాపనార్థాల సభగా మార్చారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాడని రేవంత్ రెడ్డిపై విరుచుకుప డ్డారు. మోసంచేసే పార్టీని ఏ విధంగా రైతులు ఆశీర్వాదిస్తారని పేర్కొన్నారు. 2018 లో కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి మూడు నెలల్లో ఎంపీ ఎలక్షన్లో నిలబడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని గుర్తు చేశారు. లబ్దిదారులకు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

**నిజామాబాద్,జూలై 1 :** మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్లి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.



## రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, జూలై 1 :** రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ, మరోవైపు మూసీ ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత అన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అజెండా మారుస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత సూచించారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

- పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ దాడి
- ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు

**హైదరాబాద్, జూలై 1 :** హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నారనే సమాచారంతో అతన్ని పట్టుకునేందుకు నల్లగొండ సీసీఎస్ పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు గాయమైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్ చిన్న చిన్న దొంగతనాలు చేస్తుండేవాడు. 2007లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120కిపైగా పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే అతనిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నాయి. దీంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారం తెలియడంతో సీసీఎస్ పోలీసుల బృందం వెళ్లింది. బొంగులూరు ఎగ్జిట్ వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో తప్పించుకునేందుకు శ్రీకాంత్ కత్తితో పోలీసులపై దాడికి దిగాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తలకు గాయమైంది. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడి తలకు గాయం కావడంతో హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆస్పత్రికి తరలించారు.

## రైతులను బెదిరించి డబ్బులు వసూలు

**ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్**

**ఆదిలాబాద్, జూలై 1 :** జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణ నాయక్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తలమడుగు ఎస్‌హెచ్‌ఓ డి. రాధిక తెలిపారు. ఆమె తెలిపినవివరాల ప్రకారం కజ్జర్ల-దేవాపూర్ గ్రామాల మధ్య రహదారి ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌కు రైతులు తమ పొలాల్లోని పంట అవశేషాలను తగులబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి కొంత నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు కృష్ణ నాయక్, రైతులను బెదిరిస్తూ మొక్కలకు జరిగిన నష్టానికి పరిహారంగా రూ. 1,50,000 ఇవ్వాలని రైతులను డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడి చింతలపెల్లి జైభరత్ రెడ్డి రూ. 25 వేలు, యెల్మ రఘువరన్ రెడ్డి రూ. 10వేలు, తాండ్ర మహేష్ రూ. 7,500, తాండ్ర నర్సింహులు రూ. 7,500 చొప్పున మొత్తం రూ. 50వేలు, నిందితుడికి ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కృష్ణ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు రాధిక తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి హోదాను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ!



**ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టుంది.**

కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీ పథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజనకరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగల గాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది.

కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పని చేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. అలస్యమైతే పరిహారం ఇవ్వనున్నా రు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మూడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు వివరాలను బహిరంగంగా వెల్లడించ నున్నారు. ఫిర్యాదు ల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురా నున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృ త్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణ పై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కొతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండనున్నాయి. ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.

# ట్రంప్‌పై ‘క్రిప్టో’ వర్షం..

## ఒక్క 2025లోనే రూ.11వేల కోట్ల ఆర్జన



**వాషింగ్టన్, జూలై 1 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై క్రిప్టో కరెన్సీ కాసుల వర్షం కురిపించింది. ఈ వర్చువల్ కరెన్సీలో ఆయన పెట్టిన పెట్టుబడులకుగానూ 2025లో 1.2 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.11,358 కోట్లు) ఆర్జించారు. ఈ మేరకు గవర్నమెంట్ ఎథిక్స్ కార్యాలయం వివరాలు వెల్లడించింది. 1978 చట్టం ప్రకారం అమెరికా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు తమ ఆస్తులతో పాటు ఆదాయాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఆదాయ వివరాలు బహిర్గతమయ్యాయి.

ట్రంప్ కుటుంబం 2024లో క్రిప్టో ప్లాట్‌ఫామ్ ‘వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్’ను ప్రారంభించింది. ఆ సంస్థ క్రిప్టో టోకెన్లను తీసుకువచ్చిన వెంటనే జరిపిన విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం 500 మిలియన్ డాలర్లు. అంతేగాకుండా ట్రంప్, ఆయన ముగ్గురు కుమారులు డీటీ మార్ప్ డెఫీ అనే అనుబంధ సంస్థ ద్వారా 22.5 బిలియన్ల టోకెన్లను సొంతం చేసుకున్నారు. ఇక ఏప్రిల్ 2025లో వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ ఒక స్టేబుల్ కాయిన్‌ను ఆవిష్కరించింది. 2025లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ట్రంప్ తన పేరిట మి=ఖఫీ్ క్రిప్టో కరెన్సీ ని తీసుకువచ్చారు. దానికి సంబంధించిన లైసెన్సింగ్ అగ్రిమెంట్ కింద 635 మిలియన్ల డాలర్ల రాయల్టీలను అందుకున్నారు. కాయిన్‌బేస్ వంటి ఎక్స్చేంజీల్లో ట్రేడింగ్‌లోనూ ఆయన డాలర్లు వెనకేసుకున్నారు. ఈ క్రిప్టో ఆదాయంతో పాటు గోల్ఫ్ క్లబ్స్, రిసార్ట్ ప్రాపర్టీల నుంచి 290 మిలియన్ డాలర్లకుపైగా ట్రంప్ ఆర్జించారు. ప్రస్తుత ఈ లావాదేవీలన్నీ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఆధ్వర్యంలోని ట్రస్ట్ చూస్తోంది. అధ్యక్ష పదవినుంచి దిగిపోయిన తర్వాత ఈ ట్రస్ట్‌ను ఎప్పుడైనా రద్దు చేసి.. ఆస్తుల నిర్వహణ ట్రంప్ చేతిలోకి వెళ్లేలా నిబంధనలు రూపొందించుకున్నారు. 2025లో వైట్‌హౌస్‌లోకి రెండోసారి అడుగుపెట్టిన ట్రంప్ భారీ స్టాక్స్ కొనుగోలు చేశారు. యాపిల్, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా షేర్లను కొన్నారు. ఒక్కో లావాదేవీ విలువ 5 మిలియన్ డాలర్ల నుంచి 25 మిలియన్ డాలర్ల వరకు ఉంది. సెప్టెంబర్ 23న ఒక మిలియన్ డాలర్ల విలువైన అమెజాన్ సంస్థ స్టాక్స్ కొన్నట్లు ఆదాయ వివరాల్లో ట్రంప్ వెల్లడించారు. మీడియా కంపెనీలతో నెలకొన్న వివాదాల సెటిల్‌మెంట్లు కూడా ఆయనకు ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. వీటి ద్వారా 86 మిలియన్ డాలర్లు సంపాదించారు. గోల్డ్ బార్స్‌లో పెట్టుబడుల గురించి ప్రస్తావించారు. కానుకల రూపంలో 3,70,000 డాలర్ల మేర అందుకున్నారు. లైసెన్సింగ్, పబ్లిషింగ్ అగ్రిమెంట్ల ద్వారా వచ్చిన సొమ్ము లెక్కలనూ అధికారులు విడుదల చేశారు.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న ట్రక్కును ఢీకొన్న బస్సు
- మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది సజీవ దహనం



**దౌసా, జూలై 1 :** రాజస్థాన్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలంలోనే ఏడుగురు ప్రయాణికులు సజీవదహనమయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ట్రక్కును వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు క్షణాల వ్యవధిలోనే బస్సులో భారీగా మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయట పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ̧÷ర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి అతివేగమే కారణమా లేక డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్

## ఇద్దరు పాత నేరస్థులకు రిమాండ్

**హైదరాబాద్, జూలై 1 :** బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు పాత నేరస్థులను అరెస్ట్ చేసిన పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. శివరాంపల్లి పిల్లర్ నంబర్ 295 వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ దొంగతనంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను అత్తాపూర్ పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ మొయిజ్ మోహియుద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న శాస్త్రీపురానికి చెందిన నూర్, ఫర్హాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరంతా జల్సాలు, చెడు వ్యసనాల కోసమే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి బర్గ్‌మన్, యాక్టివా వాహనాలు ఉన్నాయి. అరెస్ట్ అయిన వారు గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# విజయ్ సర్కార్‌ను కూల్చేందుకు కుట్ర

## ముగ్గురి అరెస్ట్



**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీవీకే అధినేత విజయ్ సారథ్యంలోని ప్రభుత్వాన్ని అస్థిరప రిచేందుకు పన్నిన కుట్రను భగ్నం చేసినట్లు తమిళనాడు నిఘా విభాగం వెల్లడించింది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 15మంది టీవీకే ఎమ్మెల్యేలతో ఒకేసారి రాజీనామా చేయించే లా డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ పథకం రచించారని పేర్కొంది. ఈ వ్యవహారంలో సెంథిల్ బాలాజీ సోదరుడు వి. అశోక్ కుమార్ సహా మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముగ్గురు వ్యక్తులు కుట్ర పన్నారని టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇలయరాజా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టీవీకే నేత తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ అయిన జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని ఇండియన్ పొలిటికల్ డెమోక్రటిక్ స్ట్రాటజీస్ కన్సల్టెన్సీకి చెందిన తిరునావుక్కరసు అనే వ్యక్తి తనను కోరారని ఎమ్మెల్యే ఫిర్యాదులో వెల్లడించారు. ఇందుకుగానూ రూ.35 కోట్లు ఆఫర్ చేశారని ఆరోపిం చారు. ఆ ఆఫర్‌ను తాను తిరస్కరించానని.. ఇకపై తనను సంప్రదిం చవద్దని అతడికి చెప్పినట్లు తెలిపారు. అయితే, తమ మధ్య జరిగిన సంభాషణను బయటపెడతానని తిరునావుక్కరసు బెదిరించాడని.. దీంతో పోలీసులను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే (ఐవీఖ) పార్టీ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిఘా అధికారుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. డీఎంకే నేత సెంథిల్ బాలాజీ సూచన మేరకే తిరునావుక్క రసు.. ఎమ్మెల్యే ఇళయరాజాను సంప్రదించారని పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# అయోధ్య విరాళాల చోరీ..

## కుంభమేళా సమయంలోనే భారీగా మిస్సింగ్

**అయోధ్య :** అయోధ్య విరాళాల చోరీ కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. గతేడాది ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళా సమయంలోనే రామ మందిరంలో అధిక మొత్తంలో చోరీ జరిగినట్లు తెలిపారు. కుంభమేళాకు వచ్చిన కోట్లాది మంది భక్తులు అయోధ్య రామ మందిరాన్ని కూడా సందర్శించారని, ఆ సమయంలో ఆలయానికి భారీ మొత్తంలో కానుకలు, విరాళాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇదే అదునుగా భావించిన నిందితులు కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయం చేశారన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. వారిలో లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అనే బావ మరుదులు అత్యధిక మొత్తంలో నగదు దొంగిలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు పరిశీలించడానికి ఆదాయపు పన్ను శాఖ, ఈడీ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కుట్రలో కొంత మంది ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు బ్యాంక్ సిబ్బందితో కుమ్మక్కై డబ్బును అక్రమంగా తరలించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.



# అవసరమైతే ఇరాన్‌పై మరోసారి దాడి : నెతన్యాహు

**ఇజ్రాయెల్ :** పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ కోసం ఇరాన్‌తో అమెరికా చర్చలు జరిపేందుకు సిద్ధమవుతోన్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ అణు కార్యక్రమంపై కఠిన వైఖరి అనుసరిస్తామని.. అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడి చేస్తామని హెచ్చరించారు. మూడోసారి కూడా దాడులు చేయడానికి కావాల్సిన సామర్థ్యం తమ సైనిక దళాలకు ఉందని పేర్కొన్నారు. గతంలో ఆ దేశంపై చేపట్టిన సైనిక చర్యలను నెతన్యాహు సమర్థించుకున్నారు. ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించకుండా నిరోధించే విషయంలో తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకోసం ఇతర దేశాలపై ఆధారపడబోమంటూ పరోక్షంగా అమెరికాను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. అణు కార్యక్రమాలను నిలిపివేయడంపై దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. అందుకు ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ సైనిక చర్య తప్పదని హెచ్చరించారు. తమ దేశానికి భద్రతాపరమైన ముప్పు తెచ్చే ఎటువంటి చర్యలనైనా అడ్డుకొని తీరుతామని పునరుద్ఘాటించారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగించేలా ఉండే ఒప్పందాలను ఇజ్రాయెల్ ఎప్పటికీ స్వాగతించబోదన్నారు.

**నెతన్యాహు లెబనాన్ పర్యటన..**

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని.. లేదంటే ఒప్పందం కుదుర్చుకోబోమని ఇరాన్ చెబుతోంది. కానీ, నెతన్యాహు మాత్రం తుది ఒప్పందం కుదిరేదాక ఇజ్రాయెల్ బలగాలు బీరుట్‌లోనే ఉంటాయని ఇప్పటికే వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇరాన్ నుంచి అణు ముప్పు తొలగిపోయే వరకు దక్షిణ లెబనాన్‌ను వదిలి రావద్దని తమ దళాలను ఆదేశించారు.

# పాకిస్థాన్‌లోని ఐసిస్ స్థావరాలపై డ్రోన్ దాడులు



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని ఐసిస్ స్థావరాలపై అఫ్గానిస్థాన్ డ్రోన్ దాడులు చేసింది. బలోచిస్థాన్‌లోని పిషిన్ జిల్లా సరనాన్ వద్ద ఉన్న ఐసిస్ జాయింట్ సెంటర్‌ను, ఇతర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. తూర్పు అఫ్గాన్‌లోని పలు ప్రాంతాలపై సోమవారం పాక్ చేసిన దాడులకు ప్రతీకారంగా ఈ డ్రోన్ దాడులు చేపట్టినట్లు తెలిపింది. ఇందులో పలువురు ఇస్లామిక్ స్టేట్ గ్రూపు సభ్యులు మరణించినట్లు పేర్కొంది. తమకు ముప్పుగా మారిన ఏ ఒక్క టార్గెట్‌ను వదిలిపెట్టబోమని అఫ్గాన్ రక్షణమంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా.. అఫ్గాన్ నుంచి వచ్చిన నాలుగు డ్రోన్‌లను అడ్డుకున్నట్లు పాక్ సైన్యం వెల్లడించింది. సరనాన్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాల సమీపంలో డ్రోన్ శకలాలను గుర్తించినట్లు తెలిపింది. ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తాలిబన్లను హెచ్చరించింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు పాక్ భూభాగాలను వాడుకొని తమపై దాడులు చేస్తున్నారన్న అఫ్గాన్ ఆరోపణలను పాకిస్థాన్ ఖండించింది. అయితే, తాజా డ్రోన్ దాడుల్లో ప్రాణనష్టాన్ని మాత్రం ఈ దేశం వెల్లడించలేదు. డ్రోన్ దాడులపై అఫ్గాన్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని, దానికి తగిన విధంగా బదులు చెబుతామని పాక్ సైన్యం హెచ్చరించింది.




## ఎస్ఐఆర్‌పై ఆల్ పార్టీలకు అవగాహన

### పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**నాగారం, జూలై 01 (జనం వార్త) :** నాగారం డివిజన్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ పై ఆల్ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్, తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, అనంతరెడ్డి ఎండి పాషా బాయ్, అక్బర్ బాషా, లింగం, రమేష్, దయాకర్, ఓంప్రకాష్, సంపత్, విగ్నేష్, మల్లేష్, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ పాల్గొన్నారు.



## డిఇఓను కలిసిన అక్కల సురేష్

### అడ్మిషన్ కల్పించాలని డిఈఓకు వినతి పత్రం

**నాగారం, జూలై 01 (జనం వార్త) :** జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ)ను శివసేన మేడ్చల్ నియోజకవర్గం నాయకులు అక్కల సురేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోన్నైల ఎల్లం కుమారుడు ఎస్. అఖిల్ రాజ్ ఎల్.కె.జి విద్యాభ్యాస ప్రవేశం కొరకు ఆర్.టి.ఈ చట్ట ప్రకారం సెంట్ మేరీస్ బెథనీ కాన్వెంట్ పాఠశాలలో అడ్మిషన్ కల్పించాలని కోరుతూ డిఇఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో సానుకూలంగా స్పందించి సంబంధిత పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి ఆర్టిఈ నిబంధన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన టిపిసిసి కార్యదర్శి సామల్ కార్తీక్

**శేరిలింగంపల్లి, జూలై 01 (జనం వార్త) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను టిపిసిసి కార్యదర్శి సామల్ కార్తీక్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులతో ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాను పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ బిఎల్ఓలు బిఎల్ఏలు కలసి ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు అందజేశారు. నియోజవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలని, అదే సమయంలో స్థానికంగా కొంతకాలంగా లేని వారిని గుర్తించి, వారి ఓట్లను తొలగించాలని ఎట్టి పరిస్థితుల్లో దొంగ ఓట్లు నమోదు చేయరాదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీను, అశోక్, శ్రీధర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి హరీష్‌రావును కలసిన శేరిలింగంపల్లి నాయకులు

### శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి : హరీష్ రావు

**శేరిలింగంపల్లి, జూలై 01 (జనం వార్త) :** మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సానే విజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీష్ రావుకు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై పలు అంశాలపై చర్చించారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు, పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుకుగా పనిచేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని హరీష్‌రావు సూచించినట్లు నాయకులు తెలిపారు. అలాగే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ నాయకురాలు మమత, శ్రీరాంనగర్ 'సి' బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బట్టి బాలగౌడ్, జనరల్ సెక్రటరీ రాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తీర్చే పవర్ హౌస్‌లా పంచాయతీరాజ్ వ్యవస్థ మారాలి?

- గత ప్రభుత్వ విజన్ లేని పాలన వల్లే పంచాయతీలు దెబ్బ తిన్నాయి
- గత రెండేళ్లలో గ్రామ పంచాయతీల ఖాతాల్లోకి నేరుగా రూ.4,200 కోట్లు బదిలీ
- వ్యవస్థలు బలంగా నడవాలంటే ఉద్యోగుల పాత్రే కీలకం
- ప్రజల కోసం మీరు ఒక అడుగు వేస్తే... మీ కోసం నేను వంద అడుగులు వేస్తా
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి, జూలై 1 :** 'పంచాయతీరాజ్ వ్యవస్థ కేవలం పిటీషన్లు తీసుకొని వాటిని పైకి నెట్టేసే వ్యవస్థలా కాకుండా... ప్రజల కష్టాలు తీర్చే పవర్‌హౌస్ లా మారాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళికలు, విజన్ లేకపోవడం వల్లే గ్రామ పంచాయతీలు తమ పూర్తి సామర్థ్యాన్ని కోల్పోయి నిర్వీర్యమయ్యాయని, స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించడం, గ్రామ సభలను నిర్లక్ష్యం చేయడం వల్ల గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లోపాలను సరిదిద్ది, ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలను మళ్లీ పూర్వవైభవానికి తీసుకురావడానికి గట్టి పట్టుదలతో పని చేస్తుందని స్పష్టం చేశారు. గడిచిన రెండేళ్ల కాలంలో రూ.4200 కోట్ల నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు బదిలీ చేశామని తెలిపారు. మంగళవారం రాత్రి ప్రభుత్వ అదనపు కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఓ.ఎస్.డి. కఠారి వెంకటకృష్ణ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "పాలనాపరంగా నాకు పెద్దగా అనుభవం లేకపోయినా, 2 లక్షల మంది ఉద్యోగులతో కూడిన పంచాయతీరాజ్ వ్యవస్థను ఇంత విజయవంతంగా నిర్వహించడానికి వెంకట కృష్ణ కారణం. ఆయన దగ్గర ఒక విద్యార్థిలా మారి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. 36 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆయనపై చిన్నపాటి మరక కూడా లేదు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అలాంటి వ్యక్తి రిటైర్ అయిపోతున్నారని తెలియగానే భుజం కొట్టేసినట్లు అనిపించింది. అందుకే ఆయన సేవలు మరో మూడేళ్లు కొనసాగేలా చర్యలు తీసుకున్నాం. ఇటువంటి అధికారుల వల్లే వ్యవస్థలపై నమ్మకం పెరుగుతుంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఎన్నో ఉన్నతమైన ప్రభుత్వ పథకాల రూపకల్పనలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. కేవలం పథకాలను రూపొందించడమే కాదు... ప్రభుత్వ వ్యవస్థల నియంత్రణలో, ప్రగతిశీల అభివృద్ధిలో, అత్యుత్తమ పరిపాలనా విధానాల అమలులో ఆయన చూపిన చొరవ అసాధారణమైనది. ప్రభుత్వ రంగంలో ఆయనకున్న అపార అనుభవం, సంక్లిష్ట సమయాల్లో ఆయన తీసుకున్న కీలక నిర్ణయాలు, చూపిన మేధస్సు నేటికీ, రేపటికీ ఎప్పటికీ ఎంతో మంది అధికారులకు, ఉద్యోగులకు ఒక దిక్సూచిలా, మార్గదర్శకంగా నిలుస్తాయి. పాలసీ మేకింగ్ నుంచి అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ వరకు.. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ నుండి బడ్జెట్ అండ్ ఫైనాన్షియల్ ప్లానింగ్ వరకు.. యాంటీ కరప్షన్ స్ట్రాటజీస్ నుంచి లీగల్ అఫైర్స్ వరకు ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతి విభాగంలోనూ ఆయన ముద్ర కనిపిస్తుంది. ఇటువంటి అధికారుల వల్లే ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం రెట్టింపు అవ్వడంతో పాటు, వ్యవస్థలు బలోపేతం అవుతాయి.

### ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతిననివ్వం

ప్రజలకు సేవలు సక్రమంగా అందాలన్నా, వ్యవస్థలు బలంగా నడవాలన్నా అందులో పనిచేసే ఉద్యోగులు పాత్ర కీలకం. మీ స్థాయిలో తెగని సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురండి... దానికి మనందరం కలిసి దారి వెతుకుదాం. మీరు ప్రజల కోసం ఒక అడుగు ముందుకేసి కమిట్‌మెంట్‌తో నిలబడితే... మీ కోసం నేను వంద అడుగులు వేయడానికి సిద్ధంగా ఉన్నాను. గాలివీడులో ఎంపీడీవోపై దాడి జరిగితే నేనే స్వయంగా వెళ్లి ఆయనకు భరోసా కల్పించాను. శ్రీశైలం సమీపంలోని శిఖరం చెక్‌పోస్ట్ దగ్గర అటవీశాఖ ఉద్యోగులపై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేశాం. బాధితులను కలిసి భరోసా కల్పించాం. విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు ఎదుర్కొనే కేసులు త్వరగా తేలకపోవడం వల్ల అర్హులైన వారు తమకు రావలసిన పదోన్నతులను కోల్పోతున్నారు. జీవితాంతం సేవ చేసిన ఉద్యోగులకు విశ్రాంత కాలంలో అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘ కాలంపాటు విచారణలను సాగదీయడం వల్ల ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురై, వారి మనోధైర్యం దెబ్బతింటుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలోని కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాము. విచారణ ప్రక్రియలను వేగంగా ముగించి, నిర్దోషులుగా తేలిన ఉద్యోగులకు తక్షణమే లబ్ధి చేకూర్చేలా చూశాము. గతంలో ప్రమోషన్ కావాలంటే పైరవీలు చేయాలి... బదిలీ కావాలంటే సిఫార్సులు పెట్టాలి. కానీ ఇప్పుడు ఆ పాత సిస్టమ్ కు ముగింపు పలికాం. ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు, శిక్షణ ప్రక్రియలలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించాం. అలా వ్యవహరించాం కాబట్టే మునుపెన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్ శాఖలో ఏకంగా 10 వేలకు పైగా ప్రమోషన్లను అత్యంత పారదర్శకంగా కల్పించగలిగాం. పంచాయతీరాజ్ ఉద్యోగులు ఇతర ప్రభుత్వ శాఖల పనితీరును అర్థం చేసుకోవడానికి దాదాపు 24 శాఖలలో డెప్యుటేషన్ పై పనిచేసేందుకు అనుమతి ఇచ్చాం. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ, డివిజన్ స్థాయి అధికారులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకురావడానికి డీఎల్డీవో కార్యాలయాలు తీసుకొచ్చాం. కొన్ని దశాబ్దాలుగా ప్రమోషన్లకు నోచుకోని 77 మంది అధికారులకు జెడ్పీ సీఈవోలు గా ప్రమోషన్లు కల్పించాం. అందరూ ఒక టీమ్‌గా పని చేయాలి ప్రభుత్వం అందిస్తున్న అండను, స్ఫూర్తిని పూర్తిగా అర్థం చేసుకుని, మీరంతా పంచాయతీరాజ్ వ్యవస్థలో ఒక నూతన వరవడిని తీసుకురావాలి. సీఈవో నుంచి పంచాయతీ అభివృద్ధి అధికారి వరకు అందరూ ఒక టీమ్ గా పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రతి పేదవాడి ఇంటి గడప చేరతాయి. మనం చేసే ప్రతి పనిలో పారదర్శకత ఉండాలి... అప్పుడే జనం మనతో నడుస్తారు. ప్రజలు భాగస్వాములు కానిదే ఏ సమాజంలోనూ మార్పు రాదు. ప్రజల చేతులకు కేవలం డబ్బులు అందించడం కాదు... ఊరి బాధ్యతను కూడా వాళ్ల చేతుల్లో పెట్టినప్పుడే అసలైన మార్పు మొదలవుతుంది. ఆ భాగస్వామ్యమే మన పంచాయతీలకు అసలైన బలమవుతుంది. అధికారులు కూడా ప్రజలను కేవలం పథకాలు తీసుకునే 'లబ్ధిదారులు'గా కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలక భాగస్వాములుగా గుర్తించినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. ఆక్రమణలకు గురైన భూములను కాపాడాలిగత ప్రభుత్వ హయాంలో గ్రేజింగ్ ల్యాండ్స్, కమ్యూనిటీ ల్యాండ్స్, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. అధికారులు పూర్తి బాధ్యత తీసుకుని ఈ భూములను కాపాడాలి. వారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆక్రమణలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడం ద్వారానే పంచాయతీ ఆస్తులకు రక్షణ లభిస్తుంది. అది క్షేత్రస్థాయి పాలన వైఫల్యమే చిన్న సమస్యల కోసం కూడా ప్రజలు సీఎం, డిప్యూటీ సీఎంల దాకా రావాల్సి రావడం మన క్షేత్రస్థాయి పాలన వైఫల్యానికి నిదర్శనం. నెల్లూరు జిల్లా గజ్జలవారిపల్లి గ్రామంలో రోడ్డు లేక బురదలో ఇబ్బంది పడుతున్నామని చిన్నారులు సోషల్ మీడియా ద్వారా నా దృష్టికి తెచ్చారు. ఆ సమస్య తెలిసిన వెంటనే రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశాం. అయితే దీనిని నేను ఒక విజయంగా భావించడం లేదు. అంత చిన్న సమస్య కూడా స్థానికంగా పరిష్కారం కాకపోవడం మన ఫెయిల్యూర్ గా భావిస్తున్నాను. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని, స్థానిక సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించేలా మెకానిజంను బలోపేతం చేయాల'న్నారు.

## జింఖానా క్లబ్ ఖాళీ చేయాల్సిందే..

### కేంద్రం నోటీసులు



**న్యూఢిల్లీ :** జింఖానా క్లబ్‌ను ఖాళీ చేయాల్సిందేనని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా ఎవిక్షన్ నోటీసులు పంపింది. దేశ రాజధానిలో అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఉన్న ఈ స్థలాన్ని భద్రత, రక్షణ మౌలిక సదుపాయాలు, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తామని పేర్కొంటూ.. క్లబ్‌ను ఖాళీ చేయించాలని ఆదేశించింది. 1971 నాటి చట్టం ప్రకారం.. ఇది ప్రభుత్వ ఆస్తేనని వెల్లడించింది. 1928లో అప్పటి ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్‌కు (ప్రస్తుతం ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్) ఈ స్థలాన్ని శాశ్వత లీజుపై ఇచ్చారు. అయితే లీజ్ ఒప్పందంలోని క్లాజ్ 4 ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం అవసరమైతే భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉందని కేంద్రం తన తాజా నోటీసుల్లో తెలిపింది. ఆ క్లాజ్‌ను అమలు చేస్తూ.. లీజును రద్దు చేసిన తర్వాత కూడా స్థలాన్ని ఖాళీ చేయకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఇది అక్రమణ కిందకే వస్తుందని పేర్కొంది. ఈ క్లబ్‌ను తమకు అప్పగించాలని కేంద్రం ఇదివరకే ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం నిర్ణయాన్ని జింఖానా క్లబ్ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. అయితే, ఈ పిటిషన్‌పై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుండానే.. న్యాయస్థానం తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేసింది.

## వీబీ-జీ-రామ్‌జీ పథకానికి నేడు శ్రీకారం

- తిరుపతి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రులు
- ముఖ్య అతిథులుగా సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాక

**తిరుపతి, జూలై 1 :** రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూలై 2వ తేదీన పథకాన్ని తిరుపతిలో ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో కొత్త పథకం అమలులోకి రానుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. బుధవారం నుంచి 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)'గా మారింది. వలసలకు అడ్డుకట్ట వేస్తూ 2006లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణులకు పనులు కల్పిస్తూ తీసుకొచ్చిన ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ మంగళవారంతో ముగిసింది. బుధవారం నుంచి వీబీ-జీ-రామ్-జీ అమల్లోకి వస్తున్నా.. గురువారం తిరుపతి జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె పంచాయతీ మంగంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కమలేష్ పశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా, ప్రతి మండలం లోనూ ఒక పంచాయతీలో.. వీబీ-జీ-రామ్-జీ పథకాన్ని బుధవారం నుంచి అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)ద్వారా కొత్త పథకాన్ని కొనసాగించనున్నారు. ఇందుకోసం డ్వామా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, ఇప్పటి వరకు కూలీలకు తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నారు. వీబీ-జీ-రామ్-జీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి ఉపాధి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి ఏటా 125 పనిదినాలు కల్పిస్తారు. రెండు వారాలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. ఒకవేళ చెల్లింపుల్లో జాప్యం జరిగితే, ప్రత్యేక పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలకు ఒక సారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయిలోని లోపాలు ఎప్పటికప్పుడు సవరించడానికి కూలీల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, త్వరతగతిన పరిష్కారం చేపట్టనున్నారు. పశువుల కొట్టాలు, కంపోస్టు పిట్స్, అమృత్/మినీ అమృత్ సరోవర్లు, పశువులకు చెరువులు, పూడికతీత, పునరుద్ధరణ, చెక్‌డ్యాంల పూడికతీత, ఫీడర్లు, ఫీల్డ్ ఛానెళ్లు, తవ్విన చెరువులు, చేపల చెరువులు, పశుమేత అభివృద్ధి, ఇంకుడు కుంటలు, మేజిక్ కాలువలు, రీ బుష్ ఎలాంటేషన్, కొత్త చెక్ డ్యాంలు, ఎలాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ట్రెంచ్‌లు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను చూస్తుంటే.. రైతులకు పాక్షికంగా మేలు చేసేలా ఉంది. నూతన సంస్కరణలతో వ్యవసాయ రంగానికి, రైతాంగానికి పూర్తిగా ప్రయోజనం చేకూరనుంది.



## ఆప్యాయంగా పలకరిస్తూ పెన్షన్లు అందచేత

### పేదలకు పెన్షన్ల పంపిణీ చేసిన హోంమంత్రి అనిత

**అనకాపల్లి, జూలై 1 :** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు మంత్రులు, అధికారులు పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పాత పెద్దిరెడ్డి వారి వీధిలో హోం మంత్రి అనిత పెన్షన్లను పంపిణీ చేశారు. వర్షంలో కూడా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాయకరావుపేట వార్డుల్లో పర్యటించిన అనిత.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మామిడిపండ్లు అమ్మే పైడమ్మతో హోం మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. ఆపై ఆమె వద్ద పండ్లను కొనుగోలు చేశారు. పాయకరావుపేటలో రోడ్డుపక్కన టిఫిన్ షాపు నిర్వాహకురాలిని పలకరించారు. అక్కడే స్థానిక నాయకులతో కలిసి అనిత గారెలు తిన్నారు. అనంతరం పాయకరావుపేట ఖఊఅలో నూతన భవనాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు.

## పేదవారి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే లక్ష్యం

### సిఎం ఆదేశాలతో ఇంటింటికి వెళ్లి పెన్షన్ల పంపిణీ

**విజయవాడ, జూలై 1 :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇంటింటికీ పెన్షన్ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పాల్గొన్నారు. ప్రజలకు స్వయంగా పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు అంతా కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి పెన్షన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే అత్యధిక పెన్షన్లు ఇచ్చే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందన్నారు. పేదవారి కళ్లల్లో ఆనందం చూడాలనే ముఖ్యమంత్రి పెన్షన్ పెంచారని చెప్పారు. ఏపీలో ప్రతి సంవత్సరం రూ.32 వేల కోట్లు పెన్షన్‌గా ఇస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా.. ప్రతినెలా ఈ పెన్షన్ల కార్యక్రమం ఒకటో తేదీన తెల్లవారుజామున 6 గంటలకు మొదలుపెట్టి 8:30 నుంచి 9 గంటలకు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రజలందరూ హర్షధ్వానాలతో ఆమోదిస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని ఓ రెండు కాలనీల సమస్య 20 ఏళ్లుగా కాలనీవాసులను వేధిస్తున్న స్థానిక నాయకులకు, అధికారులకు చీమకుట్టినట్టుగా అయినా లేకపోవడం విచారకరం. రెండు కాలనీలో ప్రజలు ఒకే సమస్యతో 20 ఏళ్లుగా బాధపడుతున్న అధికారులు, నాయకులు సమస్య పరిష్కారానికి కృషి చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అక్కడి ప్రజలపై అధికారులకు, నాయకులకు ఏ స్థాయిలో నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుంది. ఆల్విన్ కాలనీ సర్కిల్ ఎల్లమ్మబండ లోని అంబేద్కర్ నగర్ కాలనీ, పిజెఆర్ నగర్ కాలనీలలో నెలకొన్న 20 ఏళ్ల సుదీర్ఘ సమస్యపై జనం వార్త ప్రత్యేక కథనం.



# 20 ఏళ్లుగా తీరని

# కాలనీల సుదీర్ఘ సమస్య

- అసలు అధికారులు ఉన్నారా...? లేక కాలనీ కనిపించడం లేదా...?
- ఒకే సమస్యతో బాధపడుతున్న రెండు కాలనీల వాసులు
- ఎన్నోసార్లు ప్రమాదాలకు గురైన చిన్నారులు
- వర్షం వచ్చిందంటే నరకమే అంటున్న మరో కాలనీ వాసులు
- అంబేద్కర్ నగర్ పి జె ఆర్ నగర్ ల మధ్య నెలకొన్న సమస్య.
- వాహనం అదుపు తప్పిందా... ఇల్లు గుల్లే...!!
- గోడ నిర్మించాలని కాలవాసుల డిమాండ్

కూకట్ పల్లి, జూలై 1, ( జనం వార్త ) ఆల్విన్ కాలనీ సర్కిల్ ఎల్లమ్మబండ లోని అంబేద్కర్ నగర్ కాలనీ పక్కనే ఉన్న పీజేఆర్ నగర్ కాలనీ మధ్యలో ఒకే చోట 15 అడుగుల ఎత్తు ఉండడంతో ఇరు కాలనీవాసులు గత 20 ఏళ్లుగా ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సమస్యను పరిష్కరించడానికి ఏ అధికారి, నాయకుడు కనుచూపుమేర కూడా కనిపించకపోవడం విచారకరం. అంబేద్కర్ నగర్ కాలనీ, పీజేఆర్ నగర్ లోని వాంబే గృహాలు వద్ద ఒకే చోట 15 అడుగుల ఎత్తు ఉండడం, రక్షణ కోసం ఎలాంటి గోడ నిర్మాణం కాని, ఫెనిషింగ్ తీగలు లేకపోవడంతో పై ప్రాంతమైన అంబేద్కర్ నగర్ లో ఆడుకుంటూ చిన్నారులు ప్రమాదవశాత్తు 15 అడుగుల ఎత్తు నుండి పక్కనే ఉన్న కింది ప్రాంతమైన పీజేఆర్ నగర్ లో పడటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో అంబేద్కర్ నగర్ కాలనీలోని చిన్నారులు ఆడుకుంటూ పీజేఆర్ నగర్ వైపు కింద పడిపోతారెమో అనే భయంతో పిల్లలను తల్లిదండ్రులు ఆడుకోవడానికి బయటకు పంపడం లేదని తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం ఓ బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు 15 అడుగుల పైనుండి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. గతంలో బోనాల పండుగ రోజు ఊరేగింపుగా వస్తున్న బోనాలను చూడడంలో భాగంగా గోడ చివరి అంచులో నిలబడ్డ ఓ భక్తుడు కాలుజారి 15 అడుగుల కింద పడడంతో కాలు విరిగిపోయిందని స్థానికులు తెలిపారు.



## వాహనం అదుపు తప్పిందా...? ఇల్లు గుల్లే...!!

అంబేద్కర్ నగర్ కాలనీలోని రోడ్డులో పలు వాహనాలు తిరుగుతుంటాయి. ఇంటి నిర్మాణంలో భాగంగా ఆ రోడ్డులో ట్రాక్టర్లు తిరుగుతుంటాయి. ట్రాక్టర్ డ్రైవర్ ఏమాత్రం నిర్లక్ష్యం గా వ్యవహారించిన, లేక వాహనం అదుపు తప్పిన పి జె ఆర్ నగర్ లో గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న ఇంటిలోని దూసుకుపోవడం ఖాయం. ఇక ద్విచక్ర వాహనదారులు,ఆటోలు అదుపు తప్పితే వాహనదారులకు తీవ్ర గాయాలపాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంది.

## వర్షం వచ్చిందంటే.... నరకమే

వర్షాకాలం వచ్చిందంటే మాకు నరకమే అని పిజేఆర్ నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు ఎత్తయిన ప్రాంతమైన అంబేద్కర్ నగర్ కాలనీ నుండి కింది ప్రాంతంలో ఉన్న పిజేఆర్ నగర్ కాలనీ వాసుల ఇళ్లలోకి వరద ప్రవాహం ముంచెత్తడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలం వచ్చిందంటే వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా తడిసిపోయి తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వర్షం వచ్చిందంటే మాకు నరకమే కనిపిస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఏర్పడితే డ్రైనేజ్ పొంగి పొర్లిన ప్రతిసారి డ్రైనేజ్ మురుగు నీరు సైతం ఇళ్లలోకి వస్తుండడంతో మురుగు నీటితో సావాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పిజెఆర్ నగర్ కాలనీ వాసులు వాపోతున్నారు.

### కొంత వరకే గోడ నిర్మాణం ఎందుకో...?

రెండు బస్తీల మధ్య ఉన్న ఎత్తైన ప్రాంతము లో గతంలో అధికారులు కొంత బాగానికి గోడ నిర్మిచినప్పటికి మరి కొంత భాగాన్ని ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా ఎందుకు వదిలేశారో అర్థం కావడం లేదని కాలనీ వాసులు వాపోయా రు. అసంపూర్తిగా వదిలేసిన గోడను అధికారులు పూర్తి చేసి కాలనీవాసులను ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

### సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి

ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా రెండు కాలనీల మధ్య 5 ఫీట్ల గోడను నిర్మించినట్లయితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టు కున్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరుకాలనీల మధ్య నెలకొన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిం చాలని రెండు కాలనీ వాసులు డిమాండ్ చేశారు.



చిన్నపిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతు న్నారు. కాలనీలు ఏర్పడి 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. గతంలో ఎన్నోసార్లు ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించలేదు.

– గోపాస్ రవీందర్ ( అంబేద్కర్ నగర్ నివాసి)

...............



వర్షం వచ్చిందంటే మాకు నరకమే కనిపిస్తుంది. అంబేద్కర్ నగర్ లోని వరద నీరు మొత్తం మా ఇళ్లలోకి వస్తుంది. ఇళ్లలోని సామాన్లు వరద నీటితో తడిసిపోతున్నాయి. అంబేద్కర్ నగర్ డ్రైనేజ్ నీరు సైతం మా ఇళ్లలోకి వస్తుంది. మురుగు నీటి కంపుతో సహవాసం చేస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోడ ఏర్పాటు చేయాలి.

– లక్ష్మి (పీజేఆర్ నగర్ నివాసి)



వాహనాలు అదుపు తప్పు ఎప్పుడు మా ఇంటిపై కి వస్తాయోనని బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నాము. ట్రాక్టర్ డ్రైవర్లు ఏమాత్రం నిర్లక్ష్యం గా వ్యవహారించిన, లేక వాహనం అదుపు తప్పిన మా ఇంటి పైకి వస్తుందోనని భయంగా బతుకుతున్నాం. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. సమస్యను అధికారులు త్వరగా పరిష్కారించాలి.

– ప్రభు (పీజేఆర్ నగర్ నివాసి)

– రాము సామల
939 939 6555

# వొడాఫోన్ ఐడియా కొత్త ప్రీపెయిడ్ ప్లాన్




ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌తో ముందుకొచ్చింది. రూ.4600తో వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. అపరిమిత కాల్స్, డేటాతో దేశవ్యాప్తంగా ఉన్న 4జీ, 5జీ యూజర్లకు ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం కొన్ని సర్కిల్లోనే అందుబాటులో ఉంది. త్వరలో అన్ని సర్కిళ్లకూ విస్తరించనుంది. ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. రోజూ అపరిమిత డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వ్యక్తిగత, నాన్ కమర్షియల్ ఉపయోగానికి మాత్రమే ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 5జీ నెట్‌వర్క్ కవరేజీ ఉన్న ప్రాంతంలో 5జీ అపరిమిత డేటా లభిస్తుంది. అపరిమిత డేటాపై రోజువారీ పరిమితి లేకపోయినప్పటికీ.. 28 రోజులకు గరిష్ఠంగా 300 జీబీ వరకు మాత్రమే డేటా వినియోగించుకోవచ్చు. పరిమితి మించాక వేగం నెమ్మదిస్తుంది. రోజుకు రూ.12.6 చొప్పున ఖర్చు అవుతుంది. వార్షిక ప్లాన్‌తో పాటు 6 నెలల వ్యాలిడిటీతో మరో ప్లాన్‌నూ వొడాఫోన్ ఐడియా తీసుకొచ్చింది. 180 రోజుల వ్యాలిడిటీతో రూ. 2,475 ప్రీపెయిడ్ ప్లాన్‌ను లాంచ్ చేసింది. ఈ ప్లాన్‌లోనూ అపరిమిత డేటా, అపరిమిత కాల్స్ అందిస్తుంది. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వార్షిక ప్లాన్ మాదిరిగానే డేటా పరిమితి నిబంధనలు వర్తిస్తాయి.



# బిజినెస్



## నాలుగు భారత సంస్థలపై ఆంక్షలు తొలగించిన అమెరికా

భారత్‌కు చెందిన నాలుగు సంస్థలపై అమెరికా తాజాగా ఆంక్షలు తొలగించింది. రష్యా సంస్థలతో కలిసి పనిచేస్తున్నాయన్న కారణంతో ఆర్‌ఆర్‌జీ ఇంజినీరింగ్ టెక్నాలజీస్, లోకేష్ మెషిన్స్ లిమిటెడ్, గెలాక్సీ బేరింగ్స్, శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలను గతంలో నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది. వీటిల్లో ఆర్‌ఆర్‌జీ ఇంజినీరింగ్, లోకేష్ మెషిన్స్ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. తాజాగా వీటిపై సమీక్ష జరిపిన అగ్రరాజ్యం.. ఈ నాలుగు సంస్థలపై ఆంక్షలను ఎత్తివేసింది. రోలర్ బేరింగ్‌లు, అసెంబుల్ పరికరాలను రష్యన్ సంస్థలకు ఎగుమతి చేసిందనే ఆరోపణలతో గెలాక్సీ బేరింగ్స్ లిమిటెడ్‌పై 2024 అక్టోబరులో అమెరికా ఆంక్షలు విధించింది. రాడార్ పరికరాలు, రేడియో నావిగేషనల్ ఎయిడెడ్ పరికరాలు, రేడియో రిమోట్ కంట్రోల్ ఉపకరణాలను రష్యాకు పంపిందన్న కారణంతో శౌర్య ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకుంది. నిర్బంధం విధించిన జాబితాలో ఉన్న రష్యా కంపెనీ ఆర్టెక్స్ లిమిటెడ్‌కు 100కు పైగా మైక్రోఎలక్ట్రానిక్స్ సరుకులను సరఫరా చేసినందుకుగానూ ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్‌పై ఆంక్షలు తీసుకొచ్చింది. రష్యన్ తయారీ కంపెనీలకు డజన్ల కొద్దీ మెషిన్ టూల్స్ రవాణా చేసినందుకు లోకేష్ మెషీన్స్ సంస్థను నిషేధిత సంస్థల జాబితాలో చేర్చింది.



## స్వీడన్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026లో ఫ్రాన్స్ జట్టు సరికొత్త రికార్డులతో దూసుకుపోతోంది. న్యూయార్క్ వేదికగా జరిగిన 'రౌండ్ ఆఫ్ 32' నాకౌట్ మ్యాచ్‌లో స్వీడన్‌పై ఫ్రాన్స్ 3–0 తేడాతో ఘనవిజయం సాధించి రౌండ్ ఆఫ్ 16 కి అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ కలియన్ ఎంబాపె రెండు అద్భుతమైన గోల్స్‌తో చెలరేగి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తన పేరిట పలు రికార్డులను లిఖించుకున్నాడు. ఎంబాపె పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు వీరాభిమాని. ఫస్ట్ హాఫ్ ముగిసే సమయానికి కొన్ని క్షణాల ముందు మైఖేల్ ఒలిసే, ఉస్మానే డెంబెలే అందించిన పాస్‌ను అందుకుని ఎంబాపె ఫ్రాన్స్ ఖాతాలో మొదటి గోల్ వేశాడు. సెకండ్ హాఫ్ ప్రారంభమైన వెంటనే ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. మైఖేల్ ఒలిసే అందించిన పాస్‌తో పారిస్ సెయింట్–జర్మన్ వింగర్ బ్రాడ్లీ బార్కోలా జట్టుకు రెండో గోల్ అందించాడు. మ్యాచ్ మధ్యలో ఒలిసే అందించిన మరో అద్భుతమైన పాస్‌ను ఎంబాపె గోల్‌గా మలిచి ఫ్రాన్స్ విజయాన్ని 3–0 తో ఖాయం చేశాడు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక గోల్స్ చేసిన తన పాత రికార్డును ఎంబాపె మరింత ముందుకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం నాకౌట్ స్టేజ్‌లలో అతని మొత్తం గోల్స్ సంఖ్య 9కి చేరింది. ఈ రెండు గోల్స్‌తో వరల్డ్ కప్ చరిత్రలో ఎంబాపె చేసిన మొత్తం గోల్స్ సంఖ్య 18కి చేరింది. లియోనెల్ మెస్సి ఆల్‌టైమ్ రికార్డు (19 గోల్స్)కు అతను కేవలం ఒకే ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు. ఈ టోర్నమెంట్‌లో 6 గోల్స్, రెండు అసిస్ట్‌లతో ఎంబాపె ప్రస్తుతం గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మొదటి గోల్ చేసిన తర్వాత ఎంబాపె నేరుగా వెళ్లి తన మేనేజర్/కోచ్ ను ఆలింగనం చేసుకున్నాడు. ఇటీవలే తన తల్లి అంత్యక్రియలకు హాజరై తిరిగి వచ్చిన కోచ్‌కు ఈ గోల్ ద్వారా జట్టు మొత్తం తమ మద్దతును, ఐక్యతను చాటిచెప్పింది. ఫ్రాన్స్ జట్టు ఈ ప్రపంచకప్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి, 13 గోల్స్ చేసి కేవలం 2 గోల్స్ మాత్రమే సమర్పించుకుని అజేయంగా నిలిచింది. రౌండ్ ఆఫ్ 16 లో ఫ్రాన్స్ జట్టు పరాగ్వే తో తలపడనుంది.



# తొలి టీ20 వర్షార్పణం

ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షార్పణం అయ్యింది. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. భారత్ ఇన్నింగ్స్ పూర్తయిన వెంటనే వర్షం మొదలైంది. దీంతో ఇరుజట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లకే పరిమితమయ్యారు. వర్షం తగ్గితే 5 ఓవర్ల ఆటకు కటాఫ్ సమయం రాత్రి 1.30 గంటలుగా నిర్ణయించారు. అయితే, వరుణుడు ఎంతకీ శాంతించకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేసినట్లు అంపైర్లు ప్రకటించారు. రెండో టీ20 శనివారం (జులై 4, మాంచెస్టర్) జరగనుంది. అంతకుముందు భారత బ్యాటర్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ (59; 24 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (68; 47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చివర్లో శివమ్ దూబె (42లి; 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రెండో ఓవర్‌లోనే సంజు శాంసన్ (1) పెవిలియన్ చేరాడు. అదే ఓవర్లో ఇషాన్ కిషన్ (0) రనౌట్ కావడంతో భారత్ 6 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. మరోవైపు, దూకుడుగా ఆడిన అభిషేక్ 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అభిషేక్, తిలక్ వర్మ (13) ఔటైనా.. శ్రేయస్, శివమ్ దూబె ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. 18 ఓవర్లో అయ్యర్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్ 3, ఆదిల్ రషీద్, సామ్ కరన్ చెరో వికెట్ పడగొట్టారు.









## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ, రియాల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 162 పాయింట్ల పైకి చేరింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.23గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## తక్కువ బ్యాగేజీతో ప్రయాణించేవారి కోసం ఇండిగో లైట్

**ఢిల్లీ:** ఇండిగో పేరిట విమానాలను నడిపే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సరికొత్త ప్లాన్‌తో ముందుకొచ్చింది. తక్కువ లగేజీతో (కేవలం క్యాబిన్ బ్యాగ్ మాత్రమే) ప్రయాణించేవారికి తక్కువ ఛార్జీతో విమానంలో ప్రయాణించేలా 'ఇండిగో లైట్' పేరుతో ప్రత్యేక ఛార్జీల విధానాన్ని తీసుకొచ్చింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఈ విధానం వర్తిస్తుంది. డైరెక్ట్ ఫ్లైట్లలో మాత్రమే అనుమతిస్తారు. ఇందులో సాధారణ ఎకానమీ టికెట్లతో పోలిస్తే టికెట్ ధరలు తక్కువగా ఉంటాయి. ఇండిగో లైట్ కింద కేవలం 7 కేజీల వరకు క్యాబిన్ బ్యాగ్‌ను మాత్రమే అనుమతిస్తారు. అదనపు రుసుము లేకుండా ఆటోమెటిక్ సీటును కేటాయిస్తారు. తక్కువ లగేజీతో ప్రయాణించేవారు వారు పొందుతున్న సేవలకు మాత్రమే చెల్లించేలా ఈ టికెట్ విధానాన్ని డిజైన్ చేసినట్లు ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. విమాన ప్రయాణాన్ని మరింత ఎక్కువ మందికి, తక్కువ ధరలో అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని ఇండిగో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ అలోక్ సింగ్ తెలిపారు. ఇండిగో యాప్, వెబ్‌సైట్‌లో బుకింగ్‌పై మాత్రమే వర్తిస్తుంది. ఎయిరిండియా గ్రూపునకు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సైతం 'ఎయిరిండియా లైట్' పేరిట క్యాబిన్ బ్యాగేజీ ఓన్లీ ఫేర్ విధానాన్ని అనుసరిస్తోంది. ఇండిగో రోజూ 2100 విమాన సర్వీసులను నడుపుతోంది.

## జూన్ నెలలో 14 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. జూన్ నెలలో రూ.1.95 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీలతో వసూలైన వస్తుసేవల పన్ను మొత్తం రూ.1.35 లక్షల కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వసూళ్లు 34.6 శాతం పెరిగి, రూ.60వేల కోట్లకు చేరాయి. జూన్ నెలకు రీఫండ్ల విలువ రూ.32,436 కోట్లు కాగా.. దానిని సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.62 లక్షల కోట్లుగా ఉన్నాయి. జూన్ నెలలో తెలంగాణకు స్థూలంగా రూ.5,050 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాగా.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,548 కోట్లు వచ్చాయి. తెలంగాణలో గతేడాది ఇదే నెలతో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదు చేయగా.. ఏపీ వసూళ్లలో ఐదు శాతం వృద్ధి నమోదైంది. సర్దుబాటు అనంతరం తెలంగాణ నికర జీఎస్టీ ఆదాయం రూ.3,994 కోట్లు కాగా.. ఆంధ్రప్రదేశ్ నికర ఆదాయం రూ.3,144 కోట్లు.



## హార్దిక్ కోసం ఏడు ఫ్రాంచైజీల పోటీ

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ పాండ్య.. ఫ్రాంఛైజీని వీడనున్నట్లు కొద్ది రోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. దీంతో అతడిని దక్కించుకునేందుకు ఇతర ఫ్రాంఛైజీలు పోటీ పడుతున్నాయి. పాండ్య కోసం 7 ఫ్రాంఛైజీలు పోటీపడుతుండగా.. ఇందులో సీఎస్కే ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ అతడిని సొంతం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. కాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు మాత్రం హార్దిక్ కోసం ఆసక్తి చూపడం లేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. తన కెరీర్ కొనసాగించినంత కాలం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకోవాలనే ఉద్దేశంతో పాండ్య ఇటీవల ముంబయి నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యాడు. ముంబయిలో శిక్షణ కోసం ప్రతిరోజూ చాలా దూరం ప్రయాణించడం సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై ఐపీఎల్, జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌లు లేనప్పుడల్లా పాండ్య జశీజులో శిక్షణ పొందనున్నాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఐపీఎల్ 2026లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ఇటు కెప్టెన్‌గా, అటు ఆటగాడిగా నిరాశపర్చాడు. ఈ సీజన్‌లో ముంబయి 14 మ్యాచ్‌ల్లో నాలుగింట మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగు నుంచి రెండో స్థానంలో నిలిచింది. దీంతో ముంబయి ఇండియన్స్ అభిమానులు పాండ్యపై ఫైర్ అవుతున్నారు. అతడి వ్యవహార శైలి వల్లే ముంబయి ఆశించిన ఫలితాలు సాధించలేదని మండిపడుతున్నారు. దీంతో వచ్చే సీజన్‌కు ముందు హార్దిక్‌ను ముంబయి ట్రేడ్ చేస్తుందనే ప్రచారం మొదలైంది.

# హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ వరుసగా ఐదో విజయం

**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ–ఛాంపియన్స్ అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. బుధవారం వరంగల్ వారియర్స్‌ను హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో ఈ–ఛాంపియన్స్ వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుని ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వరంగల్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని హైదరాబాద్ 15.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్, ఓపెనర్ అభిరథ్ రెడ్డి (101; 43 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) మరోసారి అదరగొట్టి శతకం బాదాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ గడుగు గణేశ్ (50; 31 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) కూడా సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ అర్ధ శతకం బాదాడు. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన వరంగల్‌కు ఇది నాలుగో ఓటమి. సిక్సర్‌తో పరుగుల ఖాతా తెరిచిన అభిరథ్ దూకుడు కొనసాగించగా.. ఆ వెంటనే మరో రెండు సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో హైదరాబాద్ స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయింది. సాయివికాస్ (10).. క్రాంతి బౌలింగ్‌లో అమన్‌రావు చేతికి చిక్కి పెవిలియన్‌కు చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అజయ్‌దేవ్ (0) రనౌటయ్యాడు. సల్మాన్ ఖాన్ బౌలింగ్‌లో అన్విత్ రెడ్డి (4) ఔటయ్యాడు. దీంతో ఈ–ఛాంపియన్స్ 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గడుగు గణేశ్‌తో కలిసి అభిరథ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరు నిలకడగా బౌండరీలు బాదడంతో హైదరాబాద్ లక్ష్యం దిశగా సాగింది. శౌనక్ బౌలింగ్‌లో హైదరాబాద్ కెప్టెన్ ఒక సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. అభిషేక్ వేసిన 11 ఓవర్‌లో గణేశ్ వరుసగా రెండు సిక్సర్లు రాబట్టాడు. శౌనక్ వేసిన 12 ఓవర్‌లో సిక్స్ కొట్టి అర్ధ శతకం పూర్తి చేసుకున్న గణేశ్ తర్వాత బంతికే ఔటయ్యాడు. అదే ఓవర్‌లో అభిరథ్ హాఫ్ సెంచరీ (28 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిరథ్ దూకుడు పెంచాడు. శౌనక్ వేసిన 14 ఓవర్‌లో వరుసగా 6, 4, 6.. క్రాంతి బౌలింగ్‌లో 4, 4, 6 బాదేసి 90ల్లోకి వచ్చేశాడు. సల్మాన్ వేసిన 16 ఓవర్‌లో 4, 6 కొట్టి సెంచరీ పూర్తి చేసుకోవడంతోపాటు మ్యాచ్‌ను ముగించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వరంగల్ వారియర్స్ బ్యాటర్లలో కెప్టెన్ అమన్‌రావు (45; 20 బంతుల్లో) టాప్ స్కోరర్. రిషికేత్ సిసోదియా (38; 32 బంతుల్లో), శౌనక్ కులకర్ణి (24), హర్షిత్ చౌదరి (22), ధీరజ్ (18) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్‌దేవ్ గౌడ్ (3/27) మరోసారి చక్కటి ప్రదర్శన చేశాడు. దేవ్ మెహతా, అఖిల్ రాథోడ్, షణ్ముఖ అశ్విన్, ప్రణవ్ వర్మ, అభిరథ్ రెడ్డి ఒక్కో వికెట్ పడగొట్టారు.






## ఆల్ఫా సెన్సార్ పూర్తి..

శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్ధంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది.

## టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



## ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు




విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు క్రైమ్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని ఇటీవల చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో సుదీర్ఘంగా సాగే ఓ ట్రైన్ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించారట. సిట్యుయేషనల్ కామెడీతో నిండిన ఈ సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లను వినోదాత్మకంగా తెరకెక్కించడంలో త్రివిక్రమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌కు ఉన్న టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇటీవల ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్లు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం.



## సైకలాజికల్ థ్రిల్లర్‌లో అనన్య నాగళ్ల

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలతో తన పాపులారిటీని పెంచుకుంటున్నారు. ఇటీవల 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ, ప్రస్తుతం ఒక సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'లీసా' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ విలక్షణమైన చిత్రానికి జవహర్ లాల్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఓంశ్రీరామ్ ఆర్ట్స్, అయాన్ష్ రెడ్డి ప్రజెంట్స్, ఐరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నిర్మాతలు వెంకట్ దుగ్గిరెడ్డి, ఇలా రామకృష్ణ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కాగా, మేకర్స్ శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా చిత్రబృందం.. ఈ సినిమాలో అనన్య నాగళ్ల పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనన్య ముఖమంతా తీవ్రమైన గాయాలతో, చుట్టూ రక్తం మరకలతో ఎంతో భయానకంగా కనిపిస్తున్నారు. మిమ్మల్ని థియేటర్ సీటుకే కట్టిపడేసేలా, ఉత్కంఠభరితంగా వెన్నులో వణుకు పుట్టించేలా ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ఉండబోతోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాలో అనన్య నాగళ్ల లీసా అనే ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, ఈ సినిమాలో ఆమె విభిన్నమైన, షాకింగ్ కోణాలతో కూడిన ఒక అద్భుతమైన నటనను ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రానికి అవార్డు గెలుచుకున్న ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సతీష్ రెడ్డి మాసం అద్భుతమైన స్క్రీన్‌ప్లేకి తగ్గట్టుగా, కళ్లు చెదిరే విజువల్స్‌ను చాలా రిచ్‌గా రూపొందించారు. అనన్య నాగళ్ల షాకింగ్ పోస్టర్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.



## 80 రోజుల్లో 'వారణాసి' పూర్తి చేస్తాం : రాజమౌళి



ఫ్రాన్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు రాజమౌళి తన రాబోయే భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి' గురించి కీలక అప్‌డేట్‌ను పంచుకున్నారు. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా షూటింగ్ అనుకున్న సమయం కంటే ముందే పూర్తవుతుందని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'వారణాసి' అక్టోబర్‌లో పూర్తవుతుందని ఆయన తెలిపారు. తాజాగా ఈ చిత్రంపై అప్‌డేట్ అడగ్గా.. "నా నిర్మాతలు కూడా ఇక్కడే ఉన్నారు.. అందుకే నేను దీని గురించి ఎక్కువగా విషయాలు వెల్లడించలేను. అయితే, చిత్రీకరణను ఇప్పటికే దాదాపు పూర్తి చేశామని మాత్రం చెప్పగలను. ఇక మిగిలిన చిన్న సన్నివేశాలను రాబోయే 80 రోజుల్లో పూర్తి చేస్తాం" అని తెలిపారు. సెప్టెంబర్‌లోనే ముగించేస్తామని ఆయన వెల్లడించారు. దీంతో మహేశ్ అభిమానులు సంబరపడుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కానుంది. ఇక ఇదే ఇంటర్వ్యూలో ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని రాజమౌళి పంచుకున్నారు. మొదటిసారి ఆయన్ని చూసినప్పుడు ఆశ్చర్యపోయి నిల్చున్నానని చెప్పారు. జేమ్స్ కామెరూన్ 'ఆర్ఆర్ఆర్'ను రెండుసార్లు చూశాననప్పుడు తన ఆనందానికి అవధుల్లేవన్నారు. సినిమా నిర్మాణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరుగుతున్న విషయంపై తాము చర్చించుకున్నామని తెలిపారు. ఏఐ వినియోగం కొంత ఆందోళన కలిగించినప్పటికీ.. దర్శకుల సృజనాత్మకతను ఏఐ ఎప్పటికీ భర్తీ చేయలేదని కామెరూన్ తనకు చెప్పారని వెల్లడించారు. ఆ మాటలు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని తెలిపారు.

## అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది

కోలీవుడ్ యంగ్ బ్యూటీ కాయదు లోహర్ 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇటీవల ఫంకీ, పల్లి చట్టంబి వంటి చిత్రాలు చేసినప్పటికీ అమ్మడు ఆశించినంత స్థాయిలో మెప్పించలేకపోయారు. అయినప్పటికీ కాయదుకు వరుస అవకాశాలు వస్తున్నాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలో స్టార్ హీరోల సరసన చాన్స్ దక్కించుకుంటున్నారు. టాలీవుడ్‌లో నేచురల్ స్టార్ నాని సరసన 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తున్న కాయదు.. కోలీవుడ్‌లో 'ఇమ్మోర్టల్', 'ఇదాయం మురళి' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అథర్వ మురళి హీరోగా, ఆకాష్ బాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇదాయం మురళి' చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో పాల్గొన్న కాయదు లోహర్ ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. సినిమా జర్నీ గురించి కాయదు లోహర్ మాట్లాడుతూ.. "నేను నా జీవితంలో మొదటిసారి చెన్నైకి వెళ్ళింది ఈ 'ఇదాయం మురళి' సినిమా కోసమే. దాదాపు మూడు, నాలుగు సంవత్సరాల క్రితమే నేను ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేశాను. ఇంత అద్భుతమైన టీమ్‌తో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నా మొదటి తమిళ చిత్రం కావడం వల్ల అంతా చాలా సజావుగా, పర్ఫెక్ట్‌గా సాగిపోయింది" అని చెప్పారు. కథ గురించి చెబుతూ.. "ఈ చిత్రంలోని కథ అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. తమిళ చిత్ర పరిశ్రమలో వన్ సైడ్ ప్రేమకథగా నిలిచిపోయిన ఐకానిక్ మూవీ 'ఇదయం' వాతావరణాన్ని ఈ సినిమా ద్వారా పునఃసృష్టించడానికి చిత్ర బృందం ప్రయత్నించింది. పాత్రల మధ్య ఉండే నిజమైన, వాస్తవిక సంబంధాలను ఇందులో చాలా చక్కగా చిత్రీకరించారు" అని ఆమె పేర్కొన్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com